అందమైన 'ఖండాల'

- పెరుగుతున్న సందర్శకుల తాకిడి
- అభివృద్ధి చేస్తే గిరిజనులకు ఉపాధి



ఖండాల అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎఫ్ఆర్వో

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లా అంటేనే అడవుల జిల్లాగా పిలుస్తారు. ఆదిలాబాద్ రూరల్, మావల మండలలో వందల ఎకరాల్లో అడవుల విస్తీర్ణం కలిగి ఉంది. ఇది వరకే మావల గ్రామానికి అనుకొని ఉన్న అటవీ ప్రాంతాన్ని గత కొన్నేళ్ల కిందట సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో హరితవనం పార్కు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతమైన ఖండాల ప్రాంతంలో సుమారు 100 ఎకరాలలో అటవీ విస్తీర్ణం ఉంది. అక్కడి ప్రకృతి అందాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి.

మినీ కశ్మీర్..

జిల్లా కేంద్రానికి 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల అటవీ ప్రాంతాన్ని ప్రజలు మినీ కశ్మీర్‌గా పిలుస్తుంటారు. దీంతో సెలవు దినాల్లో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన పదుల సంఖ్యలో ప్రజలు అక్కడికి సందర్శనకు వెళ్తున్నారు. ఇక్కడ ప్రభుత్వం వసతులు ఏర్పాట్లు చేస్తే పిక్నిక్‌కు అనుకూలంగా ఉంటుందని పర్యాటకులు పేర్కొంటున్నారు.

సందర్శకుల తాకిడి..

ఖండాల అటవీ ప్రాంతం ఎత్తుపైన ఉండడంతో దిన దినం సందర్శకుల తాకిడి పెరుగుతోంది. అలాగే ఆ ప్రాంతంలో జలపాతాలు కూడా అందుబాటులో ఉన్నాయి. అక్కడ సందర్శకుల కోసం వాచ్ టవర్, పాగొడ, వంటి మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే బాగుంటుందని సందర్శకులు కోరుతున్నారు.

పలువురికి ఉపాధి..

గిరిజనులు అటవీ ప్రాంతం, పోడు భూములపై ఆధారపడి జీవనం కొనసాగిస్తారు. ఖండాల అటవీ ప్రాంతాన్ని పర్యటకంగా అభివృద్ధి చేస్తే ఆ ప్రాంత ప్రజలు చిరు వ్యాపారం ఏర్పాటు చేసుకొని ఉపాధి అవకాశం పొందే అవకాశం ఉంటుంది. గురువారం జిల్లా పర్యటనకు రానున్న రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణ రావు ఖండాల అటవీ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని గిరిజన ప్రజలు కోరుతున్నారు.

ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం



ఖండాల అటవీ ప్రాంతం పర్యటకులకు అనుకూలంగా ఉంది. ఇటీవలే ఆ ప్రాంతానికి వెళ్లి సందర్శించాం. పర్యటకంగా అభివృద్ధి చేసేందుకు చొరవ తీసుకోవాలని ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినాం. అక్కడ పర్యక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే చాలా మంది గిరిజనులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

– గులాబ్‌సింగ్, ఎఫ్ఆర్వో, ఆదిలాబాద్

గెలుపే లక్ష్యంగా పని చేయాలి



కండువా కప్పి ఆహ్వానిస్తున్న సోయం బాపూరావు

ఇచ్చోడ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని మాజీ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. బుధవారం ఇచ్చోడ మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు మాజీ ఎంపీ సోయం బాపూరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేస్తూ బీఆర్ఎస్ పార్టీకి ఒక్క సీటు కూడా రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో షేక్ యాఖుబ్, షేక్ జైనుల్, షేక్ మొహమ్మద్, షేక్ ఇంతియాజ్, షేక్ హసిన్ కరీం, ఫిరోజ్, అజ్గర్, అలీం, మారుతి పటేల్ పాల్గొన్నారు.

సోనాలకు మరో 30 ఇళ్లు కేటాయిస్తాం

బోథ్: సోనాల మండలానికి మరో 30 ఇండ్లు అదనంగా కేటాయిస్తామని మాజీ ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. బుధవారం సోనాల మండల కాంగ్రెస్ నాయకులు అదిలాబాద్‌లోని మాజీ ఎంపీ బాపూరావ్ నివాసానికి వెళ్లి ఇండ్ల కేటాయింపుపై చర్చించారు. ఇళ్లతో పాటు గ్రామాలకు గ్రావెల్ రోడ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సోనాల మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు లోలపు పోశెట్టి, తుల అజయ్ కుమార్, అనీష్, చెట్లపెల్లి సుధీర్, భోజన్న, గంగాధర్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఇచ్చోడ: పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతతో వ్యాధులు దరిచేరవని వైద్యాధికారి హిమబిందు అన్నారు. నర్సాపూర్(టి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు సిరిచెల్మ పరిధిలోని గ్రామపంచాయతీలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ వేడిచేసి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాథోడ్ కృష్ణ, రేణుక, సంగీత, ఆశ కార్యకర్త గంగమణి, గ్రామ పటేల్ పాల్గొన్నారు.

నేరడిగొండ: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని ఎస్‌సీఆర్పీ ప్రకాష్ అన్నారు. ధర్తి ఆభ జన్‌భాగిదారి అభియాన్‌లో భాగంగా బుధవారం మండలంలోని వాగ్ధారి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఏఈవో శ్యామ్, ఎంఎల్‌హెచ్‌పీ రాథోడ్ వాణి, ఏఎన్ఎంలు గంగామణి, శ్యామల, హెల్త్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి, ఆశ కార్యకర్త వనిత, జూనియర్ అసిస్టెంట్ మరియా పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



సినిమా తిలకిస్తున్న పీవో, దివ్యాంగ విద్యార్థులు

ఉట్నూర్‌రూరల్: వికాసం ప్రత్యేక బాలబడి దివ్యాంగ విద్యార్థులు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా చొరవతో రోజంతా ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. బుధవారం ఆదిలాబాద్‌లో మహేశ్వరి తియేటర్‌లో సితారే జమీన్‌పర్ సినిమాను ఐటీడీఏ పీవోతో కలిసి చూశారు. ఇలాంటి చిత్రాలు సమాజంలో ప్రత్యేక అవసరాల గల పిల్లల పట్ల సానుభూతి, అవగాహనను పెంపొందిస్తాయి. ఇది కేవలం వినోదాత్మక అనుభవం మాత్రమే కాకుండా, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది వంటి ప్రతిఒక్కరిలో మానవీయత, అవగాహన, పరస్పర సంభాషణకు దారి తీసే మార్గంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఆశ్రమ పాఠశాల బాలురు, బాలికలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్లపైనే మూగజీవాలు



ఆదిలాబాద్ పట్టణంలోని పలు కూడళ్లలో మూగజీవాలు రోడ్లపైనే సంచరిస్తున్నాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పశువులు రోడ్లపైనే కూర్చోడంతో పాటు సంచరిస్తుండడంతో గతంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రమాదాలు సైతం చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువులు రోడ్లపై సంచరించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు సెర్ల పొచ్చన్న బుధవారం కాంగ్రెస్‌ను వీడి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల నాయకులు వెంకటేశ్, అభిరామ్‌రెడ్డి, అబ్దులా, కిషన్, ప్రకాష్, ప్రకాష్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, భూమారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

ఉట్నూర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు భొజ్జ ఆశన్న డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉట్నూర్ ఎంపీడీవో రాంప్రసాద్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ప్రజా వ్యతిరేక, కార్మిక విధానాలను నిరసిస్తూ.. జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులు, కర్షకులు, ప్రజలు, గ్రామీణ వ్యసాయేతర కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. ఆయన వెంట ఆనందరావు, ఆత్రం సోనేరావు, రాజు, రాధా, అరుణ్, సల్మాన్ పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత

బేల: మండలంలోని మోహబత్‌పూర్ గ్రామంలో క్యాన్సర్ బాధితుడు ఠాక్రే సందీప్‌కు బుధవారం వైద్య కోసం రూ.5వేల నగదును అడనేశ్వర ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ యూత్ నాయకుడు సతీష్ పవార్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి, దేవన్న, తేజ్‌రావు, కోడే విపిన్, ఠాక్రే విశ్వనాథ్ పాల్గొన్నారు.

'ఇందిరాగాంధీ నిరంకుశ పోకడలకు నిదర్శనం'

ఆదిలాబాద్‌అర్బన్: 1975 జూన్ 25 ఎమర్జెన్సీ ఒక చీకటి రోజని, ఇందిరాగాంధీ నిరంకుశ పోకడలకు నిలువెత్తు నిదర్శనమని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కార్పొరేట్లకు గులాములేనని పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఎమర్జెన్సీపై నిర్వహించిన సెమినార్‌లో మాట్లాడారు. ప్రజాస్వామిక వాదులు, పోరాట యోధులను జైళ్లకు పంపారని తెలిపారు. కాంగ్రెస్ యేతర ప్రభుత్వాలను కూల్చి అప్రజాస్వామికంగా వ్యవహరించారన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, పూసం సచిన్, బండి దత్తాత్రి, ఆర్.మంజుల, కె.ఆశన్న, నగేశ్ పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

తలమడుగు: ఇటీవల వెలువడిన ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన నీలగిరి సాయిమిత్రకు రాష్ట్రస్థాయిలో 12 ర్యాంకు రావడంతో బుధవారం ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ సన్మానించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ర్యాంకులు సాధించాలని కోరారు.

ఆధారాలు పరిశీలించాకే ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న తుడుందెబ్బ నాయకులు

బోథ్: ఆధారాలు పరిశీలించాకే ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని తుడుం దెబ్బ నాయకులు బుధవారం సోనాల తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. 1950 కన్నా ముందు పూర్వీకులు నివాసం ఉంటేనే పత్రాలు జారీ చేయాలన్నారు. కొంతమంది తప్పుడు ఆధారాలతో ఏజెన్సీ పత్రాలు పొందుతున్నారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జుగ్నక్ మారుతి, జాకేష్, లక్ష్మణ్, ఇస్రు పటేల్, బండు, గంగాధర్, తుడుందెబ్బ నాయకులు పాల్గొన్నారు..

ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: ముదిరాజ్ కులస్తుల సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీపార్క్ ఆవరణలో భీమన్న దేవుడి ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న షెడ్డు నిర్మాణ పనులకు బుధవారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ముదిరాజు కులస్తులు ఆర్థికంగా బలపడే విధంగా ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో రూ. 3. 50 లక్షల నిధులతో షెడ్డు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శివ, శివయ్య, రాము, నారాయణ, జోగు రవి, ఆకుల ప్రవీణ్, రామదాసు, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఆదిలాబాద్‌టౌన్: రోడ్డు ప్రమాదానికి గురైన సీఆర్టీలను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పరామర్శించారు. తలమడుగు మండలం సాయిలింగి కేజీబీవీలో పనిచేస్తున్న సీఆర్టీలు విధులకు హాజరయ్యేందుకు ఆటోలో వెళ్తున్న క్రమంలో బుధవారం ఉండం గ్రామం వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు సూచించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సిరికొండ: రైతు భరోసాను రైతుల ఖాతాలో వేసిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రైతు భరోసా సంబురాలు జరుపుకున్నారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. అసలైన సమయంలో రైతుభరోసా వేయడంతో ఈ డబ్బులతో రైతులు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనులు చేసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాధవ్ పటేల్, లక్ష్మణ్, ఈశ్వర్, ఇమామ్, రసీద్, రంజాన్, కుంరం కోటేశ్వర్, జింక లస్మన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



దరఖాస్తు చేసుకుంటున్న ఆర్జీదారులు

జైనథ్: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రతీ మండల కేంద్రాల్లో పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రజావాణి ఏర్పాటు చేస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి భాస్కర్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆర్జీదారుల నుంచి 59 దరఖాస్తులు రాగా 5 దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి రవీంద్ర రావు, జైనథ్ ఉమ్మడి మండల తహసీల్దార్ ఆత్రం నారాయణ, రాజేశ్వరి, విశ్వనాథ్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోరింటాకు వేడుకలు



గోరింటాకుతో మహిళలు

ఆదిలాబాద్: ఆషాడ మాసం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన లలిత పారాయణం మహిళా మండలి సభ్యులు బుధవారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ప్రతిఒక్కరూ గోరింటాకును చేతికి వేసుకొని సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోరింటాకు అలంకరణతో శరీరంలోని నాడులని చల్లబడతాయని పేర్కొన్నారు. అదే విధంగా ఎన్నో ఔషధ గుణాలున్న గోరింటాకును పూసుకుంటే ఎంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎస్పీని కలిసిన యూత్ సభ్యులు

బోథ్: ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను బోథ్ మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన స్వామి వివేకానంద యూత్ సభ్యులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేశారు. యూత్ సభ్యులు వెండి సోమేశ్వర్, అబ్దుల్ రవూఫ్, వెండి పృథ్వి, అల్మాస్, సాబీర్‌లు పాల్గొన్నారు.

సన్మానం

బోథ్: సోనాల మండల మహర్ సంఘం అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన శంకర్‌ను సోనాల మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు గుడాల శేఖర్, లోలపు పోశెట్టి, భోజన్న, తుల అజయ్, మహేశ్, రాజేశ్, సుధీర్, అమృత్ రావ్ పాల్గొన్నారు.

ముత్తన్నకు అవార్డు ప్రదానం

బోథ్: బోథ్ మండలంలోని పొచ్చర గ్రామానికి చెందిన బిట్లింగ్ ముత్తన్న జ్యోతిష్య శాస్త్రంలో అందించిన సేవలకు హైదరాబాద్‌కు చెందిన వరల్డ్ ఛారిటి వెల్ఫేర్ ఫౌండేషన్ వారు డాక్టరేట్ అవార్డును బుధవారం అందజేశారు. ఈ అవార్డు ఛారిటి చైర్మన్ చంద్రశేఖర్ చేతుల మీదుగా అందుకున్నారు.

కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయండి

బోథ్: సోనాల మండల కేంద్రంలో సబ్‌స్టేషన్ నుంచి కుమురం భీం విగ్రహ వరకు పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని సోనాల కాంగ్రెస్ నాయకులు కోరారు. బుధవారం ఆదిలాబాద్‌లోని విద్యుత్ శాఖ ఎస్‌సీ చవాన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గాజుల పోతన్న, ఆశారెడ్డి పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

సాత్నాల: మండలంలోని మేడిగూడ(సి) పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బుధవారం ఉపాధ్యాయులు బహుమతుల ప్రదానం చేశారు. కాంప్లెక్స్ హెచ్ఎం సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు వినోద్ రావు, విజయ్ మోహన్, చిలుక సతీష్ పాల్గొన్నారు.

మంత్రులు వస్తున్నారని పనులు



టైల్స్ ఏర్పాటు చేస్తున్న కార్మికులు

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ చౌక్‌లో గల సర్కిల్‌ను ఇటీవల కుదించడంలో భాగంగా సర్కిల్ చూట్టు పూర్తిగా టైల్స్‌ను తొలగించారు.అయితే గురువారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు,గడ్డం వివేక్ వెంకటస్వామి పర్యటించనున్న నేపథ్యంలో తొలగించిన టైల్స్‌ను ఆగమేఘాల మీద తిరిగి ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం రాత్రి జోరుగా కురుస్తున్న వర్షంలోనూ పనులు చేయిస్తుండడం గమనార్హం.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ ఆదిలాబాద్.

క్లుప్తంగా

'రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్'



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సాత్నాల: రైతుభరోసా పేరుతో రైతులను కాంగ్రెస్ మోసం చేస్తుందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బుధవారం మాజీ ఎంపీటీసీ పెందుర్ దేవన్న మాట్లాడుతూ.. ఎకరానికి 7,500 రూపాయలు ఇస్తామని చెప్పి 6,000 రూపాయలు మాత్రమే ఇచ్చారన్నారు. ఇప్పుడు పంచాయతీ ఎన్నికలు నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుభరోసా గుర్తు వచ్చిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో భరత్, మాజీ సర్పంచ్ శ్రీరామ్, లక్ష్మణ్, గజేందర్, పోతన్న పాల్గొన్నారు.

'కాంగ్రెస్ జిమ్మిక్కులను నమ్మవద్దు'

జైనథ్: కాంగ్రెస్ ప్రభుత్వం జిమ్మిక్కులను రైతులు నమ్మవద్దని మాజీ ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ అన్నారు. జైనథ్ మండల కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. రైతులను మోసం చేస్తూ రైతు భరోసా సంబురాలు జరుపుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు గణేష్ యాదవ్, వెంకట్ రెడ్డి, లచ్చారెడ్డి, గొడుగుల అడెల్లు గారు, పిడుగు స్వామి యాదవ్ పాల్గొన్నారు..

జనగామ ఎమ్మెల్యేను పరామర్శించిన అనిల్ జాదవ్



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: వరంగల్ జిల్లా జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. అనారోగ్యంతో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న విషయాన్ని తెలుసుకొని బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లారు. ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు తిరుమల్ గౌడ్, శ్రీరామ్ నాయక్, ముండే పాండురంగ్ పాల్గొన్నారు.

మంత్రుల పర్యటన విజయవంతం చేయండి

నేరడిగొండ: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్ వెంకటస్వామిల జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఒక ప్రకటనలో కోరారు. గురువారం నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద మంత్రులకు స్వాగతం పలకడం జరుగుతుందన్నారు.

నేడు బైక్ ర్యాలీ

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లాకు చెందిన కార్మిక, గనులశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మంత్రుల హోదాలో తొలిసారిగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి రానున్నట్లు కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మావల బైపాస్ రహదారి నుంచి ఆదిలాబాద్ జిల్లా కేంద్రం వరకు భారీ బైక్ ర్యాలీతో వారికి ఘన స్వాగతం పలకనున్నట్లుగా పేర్కొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు ఉదయం 9:30గంటలకు పెద్ద ఎత్తున బైపాస్ వద్దకు చేరుకోవాలన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కైలాస్‌నగర్: మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని లోకల్ కంప్లెంట్ కమిటీ చైర్‌పర్సన్ భావన సింగ్ అన్నారు. మిషన్ శక్తి, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు న్యాయ సదస్సు నిర్వహించారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల చట్టం, మహిళలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లాలో మహిళల సంక్షేమానికి అనేక సంస్థలు పని చేస్తున్నాయన్నారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మిషన్ కో ఆర్డినేటర్ యశోద, స్త్రీనిధి జిల్లా మేనేజర్ పూర్ణచందర్, మేనేజర్ ఐలమ్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కృషి

నేరడిగొండ: ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కాంగ్రెస్ కృషి చేస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నరేశ్ జాదవ్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్‌లను కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.